ప్రజాస్వామ్యంలో.. ఓటే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు హక్కు నమోదుకు విస్తృత ప్రచారం

మదనపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, పాలకులను ఎన్నుకునే అవకాశం ఓటర్లకే ఉందని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం సబ్ కలెక్టరేట్‌లో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదుచేయడంతో పాటు ఎన్నికలు జరిగినప్పుడు విధిగా ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం సబ్ కలెక్టరేట్ నుంచి అవెన్యూరోడ్, బెంగళూరు బస్టాండ్, శ్రీకృష్ణదేవరాయసర్కిల్ మీదుగా అనిబిసెంట్ సర్కిల్‌కు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. బీటీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డీఏఓ రాఘవేంద్ర, తహసీల్దార్ ఖాజాబీ, డివిజనల్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ శేషాద్రిరావు పాల్గొన్నారు.

● ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెక్చరర్ సాయిశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగురెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే ఓటు

తంబళ్లపల్లె: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాజ్యాంగం ఓటు హక్కు కల్పించారని ఎన్నికల నిర్వహణ అధికారి రాఘవేంద్ర, తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. హరిత సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

ములకలచెరువు: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు, విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ హరినారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మదనపల్లె : ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ఖాజాబీ


ములకలచెరువులో మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

ఓటు హక్కు చాలా విలువైంది

కేవీపల్లె : ఓటు హక్కు చాలా విలువైందని తహసీల్దార్ నరేంద్రకుమార్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేవీపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

కురబలకోట: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదని కురబలకోట తహసీల్దారు తపస్విని, ఎంఆర్ఐ బాలసుబ్రమణ్యం అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అంగళ్లులో మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. మానవహారం అనంతరం వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వీఆర్వో ఖాదర్‌బాషా, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో ర్యాలీ

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్ నుంచి రెవెన్యూ అధికారులు విద్యార్థులతో కలసి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ బాబ్‌జాన్, ఆర్ఐ శశికళ పాల్గొన్నారు.

కలికిరి: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దారు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజా స్వామ్యంలో ఓటు చాలా విలువైందని తహసీల్దారు మహేశ్వరిబాయి అన్నారు. ర్యాలీలో డీటీ నవీన్, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్‌పీరా, వీఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

నిమ్మనపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండడం బాధ్యతగా భావించాలని తహసిల్దార్ ధనుంజయులు అన్నారు. శనివారం నిమ్మనపల్లిలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా జూనియర్ కళాశాల వద్ద నుంచి పోలీస్ స్టేషన్, వెంకోజి గారి పల్లె మీదుగా బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఓటు హక్కు పొందడం దరఖాస్తు చేయడం మార్పులు చేర్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ తిప్పేస్వామి, కళాశాల అధ్యాపకులు రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప, డిప్యూటీ తహసిల్దార్ బాబ్జి, రీసర్వే డీటీ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఓటుకు నోటు సమాజానికి చేటు

కలకడ: ఓటుకు నోటు సమాజానికి చేటు అని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని తహసీల్దార్ పనికుమార్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలకడలో తహసీల్దార్ కార్యాలయం నుంచి కలకడ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఓ రెడ్డెప్ప నాయుడు, పోలీస్, రెవెన్యూశాఖ సిబ్బంది, ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు చేతిలోనే సమాజ శ్రేయస్సు

పెద్దమండ్యం: సమాజ శ్రేయస్సు ఓటరు చేతిలోనే ఉందని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. జాతీయ ఓటు హక్కు దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దమండ్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి పురవీధుల్లో తహశీల్దార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండు కూడలిలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరు బాధ్యతగా వినియోగించు కోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సన్మానించారు. ఎస్ఐ పీవీ రమణ, ఆర్ఐ రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటనరసయ్య, ఉపాధ్యాయులు వీఆర్‌ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.


తంబళ్లపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


నిమ్మనపల్లె: ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ధనుంజయులు


పెద్దమండ్యం: సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఓటు వజ్రాయుధం

బి.కొత్తకోట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. శనివారం బి.కొత్తకోటలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతిచౌక్‌లో మానవహారం నిర్వహించి సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఓటు విలువ గురించి, ఓటు హక్కు వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. డీటీ మొహమ్మద్ అన్సారీ, కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.



గుర్రంకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, అధికారులు


బి.కొత్తకోటలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ అజారుద్దీన్


కురబలకోటలో..


కేవీపల్లెలో..

క్లుప్తంగా

నియామకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా చంద్రయ్యను నియమించినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈయన గతంలో చౌడేపల్లిలో పని చేస్తూ డిప్యుటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ టైపిస్టుగా పని చేస్తున్న సాయి గణేష్ కలకడ మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

జరిమానా చెల్లించాలి

తంబళ్లపల్లె: వాహనాల తనిఖీల్లో జరిమానాలు విధించిన వాహనదారులు తప్పకుండా చెల్లించాలని ఎస్.ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జరిమానాలు చెల్లించని వాహనదారులు ఈ సేవా కేంద్రం లోగానీ, గ్రామ సచివాలయంలోగానీ, పోలీసు స్టేషన్‌లోగానీ చెల్లించాలన్నారు. చెల్లించకపోతే సంబంధిత వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేల్ ఇండియా అండర్ -17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. బాలికల ఫుట్‌బాల్ క్రీడను మరింత ప్రోత్సహించేందుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ బాలికల విభాగంకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ పోటీలు ఫిబ్రవరి 7 వరకు జరుగుతాయన్నారు. పోటీల్లో విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు బహుమతి అందజేస్తామని తెలిపారు.

రేపు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ వారి సహకారంతో సోమవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ సూచించారు.

వైద్య శిబిరం విజయవంతం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్ట సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీహిత ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. పాఠశాల విద్యార్థులు, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు అమరనాథ్, కార్యదర్శి మునిరాజ్, కోశాధికారి కిషోర్‌బాబు, వెలుగు కన్వీనర్ ఉదయ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి విశేష స్పందన

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ప్రైవేటు స్కూల్‌లో శనివారం బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్‌మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యులు చందు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

పీలేరు: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి సమస్య పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2022 నవంబర్ 28న నోటిఫికేషన్ ఆధారంగా పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 2023 జనవరి 22న రాత పరీక్ష కూడా రాశారని తెలిపారు. అనంతరం వివిధ కారణాలతో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థుల వయస్సు పెరిగిందనే కారణంగా తిరస్కరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తిరస్కరించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి సూచించారు. శనివారం ఆయన ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలసి అంకిరెడ్డిపల్లి రోడ్డులోని హౌసింగ్ లేఔట్‌ను తనిఖీ చేసి లబ్ధిదారులతో చర్చించారు. నిర్మాణ పనులు పెండింగ్ లేకుండా దశల వారీగా బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడతామని లబ్ధిదారులకు సూచించారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం): నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాల్మీకిపురంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ నాయకులతో పార్టీ బలోపేతం, పార్టీ, అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. కూటమి నాయకులు ఎన్నికల హామీలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతు, మహిళ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాలకు సంబంధించి నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుకు కార్యకర్తల వివరాల నమోదు పత్రాలను నాయకులకు అందజేశారు. నియోజకవర్గం నుంచి జిల్లా పార్టీ కమిటీలో నియమితులైన నాయకులు జయరామ చంద్రయ్య, రాంప్రసాద్‌నాయుడు, కుమార్‌నాయుడు, అప్పల్లా, నారే వెంకట్రమణారెడ్డి, ఆనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, కేవీపల్లి, గుర్రంకొండ, కలకడ మండలాల కన్వీనర్‌లు నీళ్ల భాస్కర్, రమేష్‌కుమార్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటమణారెడ్డి, ముక్తియార్, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రహదారి భద్రత.. అందరి బాధ్యత

పీలేరురూరల్: రహదారి భద్రత అందరి బాధ్యత అని రాయచోటి డీటీఓ కె. ప్రసాద్ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పీలేరు ఎంవీఐ కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024లో మొత్తం 649 ప్రమాదాలు సంభవించాయని, ఇందులో 355 మంది మృతి చెందారని, 826 మంది గాయపడ్డారని తెలిపారు. ఎక్కువగా హెల్మెట్ ధరించని వారు చనిపోతున్నారని పేర్కొన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వంద మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ విజయకుమారి, ఎస్ఐ బాలకృష్ణ, ఆర్టీసీ డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ, డాక్టర్ ఆనందరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు శశిధర్‌రెడ్డ, మహేష్, డ్రైవర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ కె. ప్రసాద్

ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యమని మదనపల్లె ఆర్టీసీ-2 డీఎంగా అమరనాథ్ అన్నారు. మదనపల్లె ఆర్టీసీ-2 డిపో మేనేజర్‌గా బి.అమరనాథ్ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డిపో నుంచి అమరనాథ్ బదిలీపై మదనపల్లెకు వచ్చారు. డీఎంను రాష్ట్ర సీసీఎస్ పాలకమండలి సభ్యులు వినోద్‌కుమార్, ఎన్ఎంయూ కార్యదర్శి మునికృష్ణ, ఈయూ కార్యదర్శి హుస్సేన్, సీఏ బాబుతో పాటు సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో హారతి పూజ

మదనపల్లె సిటీ: స్థానిక వన్నూర్‌సాహెబ్‌గుట్టలో వెలసిన బాబా ఎహసానుల్లాఖాన్‌వార్సీ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం హారతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి బాబా నసీబుల్లాఖాన్‌వార్సీ ఆధ్వర్యంలో గంధం సమర్పించారు. భక్తులు బాబా ఆశీస్సులు తీసుకున్నారు. మజార్లకు చాదర్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హిందూ, ముస్లింలు ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కమ్యూనిటీ స్థలాలను పరిరక్షించాలి

మదనపల్లె: పేదలకు కేటాయించిన జగనన్న, ఇందిరమ్మ కాలనీల్లో ప్రజా అవసరాలు (కమ్యూనిటీ పర్పస్) కోసం కేటాయించిన స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని బహుజన్ యువసేన అధ్యక్షుడు పునీత్ కోరారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజాబీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ పట్టణంలోని బీకే.పల్లె పంచాయతీ సర్వేనంబర్ 359లో ఇందిరమ్మ ఫేస్-2 పథకం కింద 80 ప్లాట్లు కేటాయించారన్నారు. ఆ ప్లాట్లకు సంబంధించి లే అవుట్‌లో కమ్యూనిటీ పర్పస్ కోసం కొంత స్థలాన్ని కేటాయించారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ స్థలంలో ఇతరులు ఎలాంటి నిర్మాణాలు చేయరాదన్నారు. అయితే కొందరు వ్యక్తులు వీటిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తుండటంతో అప్పట్లో అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, శ్రీనివాసులు, శశికుమార్, జిలానిబాషా, ఆది, శివ, హరికుమార్, భానుప్రకాష్, మురళి పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె సిటీ: విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు కెరియర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. తాము ఎంచుకున్న కెరీర్‌ను ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, హెచ్‌ఓడీలు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి పూజలు


స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలు రకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

లో వోల్టేజీ సమస్యపై స్పందించాలి

తంబళ్లపల్లె: ద్యుత్ సరఫరాలో ఎక్కడ లో వోల్టేజీ సమస్య వచ్చినా సిబ్బంది వెంటనే స్పందించాలని విద్యుత్‌శాఖ ఏడీఈ గోవిందరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. పలు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. లోవోల్టేజి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రానున్న వేసవిలో ఎక్కడ విద్యుత్ సరఫరా అంతరాయం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈ శేషు, లైన్‌మెన్ శంకర్ పాల్గొన్నారు.

ప్రతి కార్డుకు నిత్యవసర సరుకులు అందించాలి

కలకడ: మండలంలోని రేషన్ కార్డు కలిగిన వారికి నిత్యవసర సరుకులు అందించే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లుపై ఉందని తహసీల్దార్ పణికుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ చౌకధరల దుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లుతో నిత్యవసర సరుకుల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్డుదారులకు ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం, కంది పప్పు, చక్కర డీలర్లు అందుబాటులో ఉండి సాకాలంలో అందించాలని, ఎలాంటి ఫిర్యాదులు అందిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీటీ ఫజులుల్లా, వీఆర్‌ఓలు, డీలర్లు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వండి.. మహాప్రభో..!

మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ ఆవేదన

కలికిరి: ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసి, ఏళ్లు గడుస్తున్నా బిల్లులు ఇవ్వకపోవడంపై గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2020 సంవత్సరంలో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేశామని, ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదని, బిల్లులు మంజూరు చేయకపోతే ఎం-బుక్ రికార్డులు అప్పగించాలని వెంకటరెడ్డి కోరారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మినీ గోకులాల మంజూరులో స్థానిక సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూశాఖ సమీక్షలో భాగంగా తహసీల్దారు మహేశ్వరిబాయి మాట్లాడుతూ మండలంలో నిర్వహించిన గ్రామ సభల్లో రైతుల నుంచి భూ సమస్యలపై మొత్తం 440 వినతులు వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పక్కా గృహాలను మార్చి నెల లోపు లబ్ధిదారులు నిర్మించుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ భానుమూర్తిరావు, డీటీ నవీన్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కె.ఓబులేసు తెలిపారు. జాబ్‌మేళాకు నాలుగుసంస్థల ప్రతినిధులు హాజరయ్యారని, మొత్తం 62 మంది అభ్యర్థులు హాజరయ్యరని తెలిపారు. ప్రతి నెలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా సాధనకు కురుబల చైతన్యయాత్ర

మదనపల్లె: కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఏప్రిల్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చైతన్యయాత్రలు నిర్వహించనున్నట్లు ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కురవంకలోని కురుబసంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ కురుబ సంఘం రాష్ట్ర కార్యవర్గ జాబితా వివరాలను మీడియాకు వెల్లడించారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా తట్టి అర్జున్‌రావు(విజయవాడ), ఉపాధ్యక్షులుగా కే.నాగేశ్వరరావు (కడప), కె.రెడ్డికుమార్ (తిరుపతి), కె.మద్దిలేటి (కర్నూలు), కె.వి.చలపతి (హిందూపూర్), సంతోష్ (కుప్పం), ట్రెజరర్స్‌గా సి.విఠల్‌గౌడ్, సెక్రటరీలుగా వల్లిగట్ల వెంకటరమణ, కె.సీతారామయ్య(కర్నూలు)తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కురుబ సంఘ నాయకులు రాజ్‌కుమార్, గుడి రామాంజులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

కేవీపల్లె: మండలంలోని వగళ్ల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో స్టేట్ రిసోర్స్ పర్సన్లు నరేష్, ఆనంద్ శనివారం తనిఖీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, ఆహారం, భద్రత, విద్యార్థుల అభివృద్ధి, ఉపాధ్యాయుల పనితీరుకు సంబంధించి 179 ప్రశ్నల ఆధారంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు.